# అందం

పెళ్లి చూపులకి అబ్బాయి రాబోతున్నాడంటే—

అమ్మాయికేకాదు, ఆమె అమ్మానాన్నలకీ కంగారే. అందులోనూ—అదే మొదటిసారి అయితే ఇక చెప్పేదేముంది?

వారం రోజుల కిందట—

పెళ్ళి సంబంధాలు కలపడం పార్ట్‌టైమ్ జాబ్‌గా పెట్టుకున్న పేరిశాస్త్రి రంగధామ్ ఇంటికి వచ్చి ఆ మాటా ఈ మాటా చెప్పి కాఫీ పుచ్చుకుంటూ అసలు విషయం బయటపెట్టాడు. ''బెజవాడలో ఫస్టుక్లాయిన సంబంధం ఒకటి ఉంది. దివ్యమైన సంబంధం. పెళ్లికొడుకు బ్యాంకులో ఉద్యోగి. ఒక్కగా నొక్క చెల్లెలికి ఈ మధ్యే పెళ్లి చేసి అత్తారింటికి పంపేశాడు. ముసలి తల్లి తప్ప మరే బాదరబందీ లేదు. మనిషి బాగుంటాడు. ఏ చెడు అలవాట్లూ లేనివాడు. మీదు మిక్కిలి డబ్బు మనిషికాదు. కట్నకానుకలాశించడు. గొంతెమ్మ కోర్కెలు కోరడు. నమ్మ లేనంత మంచి సంబంధమంటే నమ్మండి''

ఆ మాటలకి రంగధామ్‌గారి కళ్లు మెరిశాయి.

''అబ్బాయికి అమ్మాయి నచ్చితే చాలు. మూడు ముళ్లూ వేసేసినట్లే. మీరు ఊ అంటే వారం తిరక్కుండా అతన్ని పెళ్లిచూపులకి రప్పిస్తాను'' భరోసా ఇస్తున్నట్లే అన్నాడు మధ్యవర్తి.

''ఒక్కసారేమిటి, వందసార్లన్నా అంటాము. ఆడపిల్లలు కలవాళ్లం. అన్నయ్యగారూ! అమ్మాయిని చూసుకుందుకు అబ్బాయిని వీలైనంత తొందరగా రప్పించండి. ఇలాటి విషయాల్లో ఆలస్యం అమృతం విషమూ, శుభస్య శీఘ్రమూ కదా!'' అంది అన్నపూర్ణ.

''అదెంత పని? ఇవాళే కబురంపుతాను. వచ్చే ఆదివారం సాయంత్రం ఐదు గంటలకి ముహూర్తం బాగుంది. ఆ సమయానికే పెళ్లి చూపులనుకుని సిద్ధంగా ఉండండి'' అని పేరిశాస్త్రి శలవు తీసుకున్నాడు.

అప్పటి నుంచీ రంగధామ్ మనసులో లజుగుజులు పడుతున్నట్లు కనిపించసాగారు.

''ఏమిటండీ? దేని గురించీ అలా ఎడతెరిపిలేకుండా ఆలోచిస్తున్నట్లున్నారు? నాకూ చెప్పొచ్చుగా. భార్యనే తప్ప పై దాన్నికానుగా?'' ఉండబట్టలేక అడిగిందావిడ.

''అదికాదన్నపూర్ణా! మనం ముందుగా ఎవరి పెళ్లి చేయాలి? శారదకా విశారదకా?'' సందేహం బయటపెట్టారాయన.

''దీనికింత ఆలోచనా! వాళ్లిద్దరూ కవలలే అయినా... కొన్ని నిమిషాల తేడాతోనే పుట్టినా...ముందు జన్మించింది శారదేగా! కనుక ఆమే పెద్దది. ఆమె పెళ్లేముందు చెయ్యాలి.'' తీర్మానించేసినట్టే అందావిడ.

''అహా... అదికాదు కవలలు కదా అని... సరేలే... ఔను నువ్వు చెప్పిందే నిజమూ న్యాయమూ. ఈ బెజవాడ పెళ్లి కొడుకు శారదనే చూపిద్దాం. ఈ మాట ఆమెకి చెప్పు''

''ఎప్పుడో చెప్పేశాను. ఏమైనా ఈ సంబంధం కుదిరితే మనం చాలా అదృష్టవంతులమౌతాం. ఈ రోజుల్లో కట్నంకోరని వరుడూ దబ్బావ లేని మనుషులూ అంటే— అతి అరుదూ మహా అబ్బురమూను''

''ఔను''

ఆదివారం సాయంత్రం... ఇంకా నాలుగైనా కాలేదు.

కొత్త బిచ్చగాడు పొద్దెరగడన్నట్లు వేళ ఇంకా చాలా ఉన్నా అప్పటి నుంచే చీటికీ మాటికీ గేటు వేపు చూసేస్తున్నారు రంగధామ్ దంపతులు. తాను చేయవలసిన పనులు ముందుగా ముగించేసి శారదనలంకరించడమనే పనిని విశారదకప్పగించేసి తానుకూడా వరండాలోకి వచ్చి భర్తతోపాటు కూర్చుంది అన్నపూర్ణ. ఇద్దరి పరిస్థితీ పెద్ద పరీక్షకు పిల్లవాడిని పంపిస్తున్నట్లుగా ఆత్రంగా ఉంది.

గేటు దగ్గర ఆటో ఆగిన చప్పుడు.

హడావిడిగా పరుగెత్తారు రంగధామ్. ఒంటరిగా మిగిలిపోయిన అన్నపూర్ణకేం చేయాలో తోచనట్లూ... ఏదో ఒకటి చెయ్యకుండా ఉండడం ఎలా అన్నట్లూ... ఆవిడకూడా భర్తవను సరించింది మెల్లనైన నడకతో.

ముందు పెళ్లికొడుకు దిగాడు ఆటోలోంచి. అతన్ని చూస్తూనే నిశ్చేష్టుడైపోయారు రంగధామ్. మధ్యవర్తి కూడా దిగారు.

భర్త నోటమాటరాక బెల్లంకొట్టిన రాయిలా మిగిలిపోడంతో ''రండి... లోపలికి రండి...''



అంటూ ఆహ్వానించవలసిన బాధ్యతను తనే నిర్వహించిందావిడ— విధిలేక.

''ఇప్పుడుకాదు. ఇంకా వ్యవధుంది. అనుకోకుండా కొంచెం ముందుగా వచ్చాడబ్బాయి. అతను స్నానం చేసి విశ్రాంతి తీసుకున్నాక... ఐదుకి ఇక్కడికి వస్తాం. ఎటూ తోవే కదా అని మీకు చెప్పి వెళ్ళొచ్చని ఆగాం. అంతే'' అంటూ మళ్లీ ఆటో ఎక్కేశాడాయన పెళ్లికొడుకుని కూడా ఎక్కించి. వీళ్లు వెళ్లిపోయినా రంగధామ్ తేరుకోలేదు. అలాగే చేష్టలుడిగి నిలబడిపోయారు.

''పెళ్ళి కొడుకెంత అందంగా ఉన్నాడని! చూడ్డానికి రెండు కళ్ళు చాలవు. మగవాళ్ళలో అంత అందం అరుదు. ఔనూ... మీరేమిటత న్ని చూస్తూ అలా చేష్టలుడిగిపోయారూ?''

''అందుకే''

''మీ ఉద్దేశమేమిటి? మీ మనసులో ఏముంద సలు?'' అర్థంకానట్లు చూసిందావిడ.

''చెబుతాను కానీ... ముందు... వేడిగా ఓ కప్పు కాఫీ ఇవ్వు. శారదనీ, విశారదనీ పిలువ్'' అంటూ వరండాలోకి వచ్చి కుర్చీలో కూర్చు న్నారు.

''ఏమిటో... అయోమయమూ, అడవి పం చాగమూ...'' గొణుక్కుంటూ— కాఫీ తెచ్చి ఇచ్చి

''శారదా! విశారదా! నాన్నగారేదో చెబుతార ట పిలుస్తున్నారు'' అంటూ కేకవేసింది.

వాళ్ళిద్దరూ బుద్ధిగా వచ్చి తండ్రికెదురుగా కూర్చున్నారు.

''పెళ్ళి చూపులలో ఎలా ప్రవర్తించాలో చెబు తారా నాన్నగారూ? శారదకి కదా చూపులు? మరి నాకు కూడా క్లాసెందుకూ? ఓహో! పనిలో పనినా!'' నవ్వుతూ అంది విశారద— ''ఒకే పాఠం. ఇద్దరు శ్రోతలు''

''విశారదా! నేను చెప్పబోతున్నది తేలిక విష యం కాదమ్మా. శారదా! ముఖ్యంగా నువ్వు జాగ్రత్తగా ఆలోచించాలి. సంయమనంతో వ్యవ హరించాలి. నన్నర్థం చేసుకోవాలి'' అన్నాడా యన గంభీరంగా.

''ఏమిటి నాన్నగారూ?''

''పెళ్ళి చూపులకి రాబోతున్న అబ్బాయి చా లా మంచివాడు. 'యత్ర రూపం తత్ర గుణాః' అని ముఖం చూస్తేనే తెలుస్తుంది. ఏ విధంగా చూసినా ఎంత మాత్రమూ చేజార్చుకోకూడ నంత మంచి సంబంధం'' ఒక్క సారాగారు ''శారదా! విశారదా! ఒకే కాన్పులో కొద్ది నిము షాల తేడాతో జన్మించిన మీరిద్దరూ ఒక విధం గా కవలలు. కానీ మీ మధ్య విచిత్రంగా చాలా వ్యత్యాసమూ ఉంది. శారదా! నువ్వు ముందు పుట్టావు. నువ్వు చదువుల సరస్వతివీ సంగీతా నికి కోకిలవీ. విశారదా! నువ్వు అందంలో అప్స రసవి. ఇద్దరికీ ఒకేసారి పెళ్ళి చేయగలిగితే బాగా నే ఉండేది. కానీ అది కష్టం. కొంచెం ముందు వెనుకలు తప్పవు. కొన్ని నిముషాలే అయినా ముందుగా భూమిమీద పడిన శారదకే ముందు గా పెళ్ళిచేయడం న్యాయమనుకున్నాం మీ అ మ్మా నేనూ''

ఆ ముగ్గురూ ఆయన మాటలను మౌనంగా వింటున్నారు.

''ఇందాకా పెళ్ళికొడుకుని చూశాను. చాలా అందమైనవాడు.''

''ఇంతా అంతా అందంకాదు చెప్పనలవి కా దు'' వత్తాసుపలికింది అన్నపూర్ణ.

''నేనూ మగవాడినే కనుక మరో మగవాడి మనస్తత్వాన్ని బాగా గ్రహించగలను. అర్థం చేసు కోగలను. తానందంగా లేకపోయినా అందమైన భార్యని మాత్రమే కోరుకునే అత్యాశాపరుడు మగవాడు. మరి... ఇక... అతిలోకసుందరుడై న ఈ వరుడు సహజంగానే అతి చక్కని అమ్మాయిని కోరుకోడంలో ఆశ్చర్యమూ ఉం డదు, అన్యాయమూ ఉండదు. ''ఏమంటార న్నట్టు వారి ముఖాలలోకి చూశారాయన.

చటుక్కున కలుగజేసుకుంది శారద. ''మీ బాధా అభిప్రాయమూ నాకర్థమయ్యాయి నా న్నగారూ! ఈ సంబంధం ఒదులుకోలేనిది. అతనేమో అతి రూపవంతుడు. నేనేమో అనా కారిని కాకపోయినా అందం దృష్ట్యా అతి సామా న్యురాలిని. తానూ అందంగా లేనివాడైతే నన్నం గీకరించగలడేమోకానీ... ఇతనికి మాత్రం నే ను కాకిముక్కుకి దొండపండునే. నా బదులు విశారదైతే అతను తప్పక అంగీకరిస్తాడు. సం బంధం చేజారిపోదు అంతేనా?''


ఆయన చాలా తప్పుచేసినట్లుగా తలవంచుకు న్నాడు. ''క్షమించమ్మా. నా ఆలోచన అచ్చం గా అదే. అంతే... నువ్వు చాలా తెలివైన దానివి కనుక చక్కగా గ్రహించగలిగావ్''

అన్నపూర్ణ త్రుళ్ళిపడిందామాటలకి.

''దీనికంత విచారించడం దేనికి నాన్నగారూ ? నేనూ విశారదా అక్కచెల్లెళ్ళమే కానీ పరాయి వాళ్ళమూ ప్రత్యర్థులమూ కాము. ఎవరి సుఖ సంతోషాలైనా ఇద్దరివీను. మీ ఆలోచన సబబైన దీ వాస్తవికమైనది. నాకు ఆట్టే అందంలేని మాంఛి వరుడుని చూడొచ్చు తరువాత...''

''కానీ పెద్దపిల్లకి ముందు పెళ్ళి చెయ్యకుం డా'' అయిష్టం వ్యక్తం చేసిందన్నపూర్ణ.

''పరిస్థితి అర్థం చేసుకోమ్మా. అంత అంద మైనవాడికి విశారద నచ్చుతుంది కానీ నన్ను చూపించి ఏం ప్రయోజనం? సంబంధం వదు



ఇచ్ఛాపురపు రామచంద్రం

లుకోకూడదంటే ఇదే మంచి పద్ధతేమో నాన్నగారూ! ఇవాళ్టి పెళ్లిచూపులకి అతని ముందు నా బదులు విశారదే కూర్చుటుంది. నేనెంతో సంతోషంగా, సహృదయంగా చెల్లెలిని అలంకిస్తాను. సరేనా? పద చెల్లే... వాళ్లు వచ్చే వేళైంది'' అంటూ శివారద చేయందుకుంది శారద.

''నీకూ త్వరలోనే మంచి సంబంధం చూసి''

''ముందు ఇది కానివ్వండి నాన్నగారూ! మిగిలినవి తర్వాత తీరిగ్గా ఆలోచించవచ్చు'' అంటూ విశారదను తీసుకుని లోపలికి వెళ్లింది శారద.

''సారీ అక్కా!'' ఇలా జరుగుతున్నందుకు నాకు బాధగానే ఉంది.

''భలేదానివే! అలాటివి మనసులో పెట్టుకోకు. నాకైతే చాలా సంతోషంగా ఉంది. నీ సౌందర్యానికి తగిన పురుషుడు లభించబోతున్నాడంటే నీకోసం రాబోయే వరుడు అతి చక్కనివాడని అమ్మా నాన్నా చెప్పారుగా. రా... నిన్ను చూసి అతను మూర్ఛపోయేంత అందంగా తీర్చిదిద్దుతాను''


''అది కాదక్కా'' ఏదో చెప్పబోయింది విశారద.

''ఉష్! కొన్ని నిముషాల ముందు పుట్టినందుకే నేనక్కనైపోతానా? మనం కవలలం. చూడు మనసులో ఏ శంకలూ పెట్టుకోకు. వివాహాలు స్వర్గంలో నిర్ణయించబడతాయట'' అంటూ ఆమెనలంకరించసాగింది శారద. ''నా కెందుకో ఏమిటోగా ఉందక్కా'' అని విశారద మాటిమాటికీ అంటున్నా.

అతను వచ్చాడు. విశారదని చూశాడు. ఆమె కూడా అతన్ని చూసింది. వాళ్లిద్దరినీ వధూవరులుగా ఊహించుకుంటూ మిగిలినవాళ్లు చూశారు.

''త్వరలో ఉత్తరం రాస్తాను'' అని వెళ్లిపోయాడు వరుడు మధ్యవర్తితో కలిసి.

''నిజంగా మీరు చాలామంచి పనే చేశారు'' అంది అన్నపూర్ణ ఏకాంతంలో భర్తనభినందిస్తున్నట్లుగా. ''వెయ్యానికీ వియ్యానికీ సమానత్వమంటారే.. విశారదా అతనూ అందంలో... సమానంగా ఉన్నారు. ఈడూ జోడూ సరిగ్గా సరిపోతుంది. ఎంత కన్నతల్లినయినా నాకే అతని పక్కన శారదైతే వెలావెలా పోతుందనిపించింది మీరు చాలా సమంజసంగా ఆలోచించారు. అతనికి మన విశారద నచ్చితీరుతుంది'' రంగధామ్ ఏమీ అనలేదు చిరునవ్వునవ్వి ఊరుకున్నాడు.




''ఇరవై ఏళ్ళుగా మీరు ఉపాధ్యాయ వృత్తిలో సాధించిందేమిటి?'' అడిగాడు మారుతీరావు.

''విద్యార్థుల్ని!'' పొడిగా సమాధానం చెప్పాడు ఫణిభూషణం.

రాయవరపురవి, రామాయంపేట.

నాలుగైదు రోజులలో ఆయనకొక ఉత్తరం వచ్చింది.

''శ్రీయుతులు... గౌరవనీయులు... రంగధామ్ గారికి...

వినయపూర్వక నమస్కారములు. ముందుగా మీ అమ్మాయి విశారదగారి అత్యద్భుత సౌందర్యానికి నా అభినందనలు తెలియజేస్తున్నానని నన్నసభ్యంగా భావించకండి. సంస్కార విహీనుడిగా తలచకండి. నిజానికి... సభ్యత కోసమే. నేను మీకర్థం కావాలనే సంస్కారంతోనే మీకీ దీర్ఘమైన లేఖ రాస్తున్నాను. నా అనుభవం మీకు తెలియజేస్తున్నాను. నలుగురూ నన్ను అందమైన వాడంటారు. అది నిజమైనా కాకపోయినా నా చెల్లి మామూలుగా ఉంటుంది. అందమైనది కాదు అందరి దృష్టిలోనూ! ఆమెకు వివాహం చేయవలసిన బాధ్యత నామీద పడింది. ఎన్ని సంబంధాలు వెతికానో! ఎంతశ్రమపడ్డానో! ఆమెను చూడడానికి వచ్చిన వారల్లో కొందరైతే—

''అమ్మాయి బాగులేదు''

''మాకు నచ్చలేదు''

''కోడలు నలుపైతే కులమెల్లా నలుపే. ఈ నల్లమ్మాయినెవరు చేసుకుంటారు?'' అంటూ అన్యాయంగా... అసభ్యంగా సంస్కార రహితంగా... ముఖంమీదే చెప్పేసేవారు పెదవి విరుస్తూ. దానితో మా చెల్లి కుమిలి కుమిలి ఏడిచేది. నిజమే. ఆమె చేసిన నేరమేమిటి? చేయని నేరానికి మనసులో విషపుముళ్లు గుచ్చితే ఎవరికి బాధ కలగదు? కోరుకున్న కులంలో పుట్టడమూ... అదంగా పుట్టడమూ ఎవరి అధీనమూ కాదుగా? అలాగే అయితే ప్రపంచంలో అందరూ అందంగానే ఉండేవారు.

''లక్షఇస్తే చేసుకుంటాం...'' అన్నారు కొందరు. అక్కడికి అందంగా లేకపోడానికి కట్నం పరిహారమన్నట్లు... తప్పుకి జరిమానా అన్నట్టు.

విచిత్రమేమిటంటే. తానేమీ బాగుండని వరుడుకూడా మా చెల్లిని కురూపి అనడం! ఇలాగ... ప్రతి పెళ్లిచూపులూ ఆమె పాలిట అవమానమూ అగ్నిపరీక్ష ఔతూండేవి. అయినా తప్పదుకదా! పెళ్లంటే ముందుగా చూపులు అనివార్యం. ఇవన్నీ చూస్తుంటే నాలో కొన్ని అభిప్రాయాలూ ఆలోచనలూ కలిగేవి.

అందమనేది చర్మపు మందమే (Beauty is Skin deep) సౌందర్యపు పొర అతిపలచనా సుకుమారమూ. చిన్న ప్రమాదం... కొన్ని వ్యాధులు... వేటితో నైనా నశించిపోయేంత బలహీనమూ అశాశ్వతమూ అందం. దీనికోసం మనుషులెందుకంత వెర్రి పిచ్చి ఎక్కిపోతారు? పెళ్లి చేసుకునే అబ్బాయిలకందరికీ అత్యంత అంతమైన అమ్మాయిలే కావాలి! కానీ ప్రపంచంలో అందమైన అమ్మాయిల సంఖ్య తక్కువ (అందువల్లనే అందానికా ప్రత్యేకతేమో?) సామాన్యుల సంఖ్య ఎక్కువ. అందరూ అందమైన వారినే చేసుకుంటామంటే మిగిలినవారి సంగతేంకావాలి? అందంగా ఉండని అమ్మాయిల మీద నాకు జాలి కలిగేది.

వివాహమనేది అందచందాలతో నిమిత్తంలేకుండా... వయసు వచ్చిన స్త్రీ పురుషులిద్దరి అవసరమూ యువతీ యువకుల జీవతావసరమే తప్ప వివాహమనేది వ్యాపారం ఎంత మాత్రమూ కాదు కదా. మరి ప్రతి పెళ్లిలోనూ కట్నానికింత ప్రముఖపాత్ర ఏమిటి?

శ్రమ అయినా చివరికి మా చెల్లికి మంచి వరుడినే చూసి పెళ్లి చేయగలిగాను. ఐతే నా అనుభవాలు నాలో కొన్ని దృఢమైన నిశ్చయాలనూ కలుగజేశాయి. నేనెంత మాత్రమూ కట్నం తీసుకోడదని వాటిలో ఒకటి.

ఇతరులు నీ పట్ల ఏవేవి చేస్తే నీకప్రియమో— వాటిని నువ్వితరులకి చేయకు అని కదా మహాభారతం చెప్పేనీతి? నాకది చాలా నచ్చింది. దానిని అక్షరాలా పటించాలన్న ఆదర్శమేర్పరచుకున్నాను. మా చెల్లి పెళ్లి వలన అయిన చేదు అనుభవాలవల్ల మీ అమ్మాయి విశారద అత్యంత సౌందర్యవతి కనుక ఎవరైనా ఆమెని కళ్లకద్దుకుని వివాహం చేసుకుంటారన్న నమ్మకమూ ఆశా నాకున్నాయి. అందమైన ఆమె వివాహం సమస్యకాబోదు. అందుకే నేను అందంగా ఉండని మరో అమ్మాయిని చూసి ఆమెతో వివాహానికంగీకరించాను. ఇలా చేయడంలో నా మనసుకేదో తృప్తి లభించింది. అందంగాలేని ఓ అమ్మాయి వివాహాన్నయినా సమస్యకాకుండా సులభం చేయడం నాకు సంతోషంగా ఉంది. ఈపాటికి నా అంతరంగం మీకు తెలిసింది కనుక మీరూ, మీ అమ్మాయి నా తిరస్కృతిని వేరుగా భావించరనీ... నన్నర్థం చేసుకుని క్షమించగలరనీ ఆశిస్తూ శలవు తీసుకుంటున్నాను.